# ప్రలోభాలకు గురిచేస్తున్న కాంగ్రెస్

- **ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

భూత్పూర్/కొత్తకోట, నవంబర్ 17 : ప్రలోభాలకు లొంగదీసుకుంటే ఎక్కువ కాలం పార్టీలో ఉండలేరు. కాంగ్రెస్ పార్టీలో అందరూ అదే విధానానికి అలవాటు పడుతున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆల సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరారు. కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో పాత మొల్గరలో కొత్తకోట మాజీ ఎంపీపీ బాలరాజుతోపాటు మరో 60మంది, మం డలంలోని పోతులమడుగు గ్రామ సర్పంచ్ దాసును గురువా రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి ప్రలోభాలకు లొంగదీసుకొని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పినట్లు దాసు తెలిపారు. తిరిగి దాసు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాను కప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు చేసింది ఏమి లేక ఇప్పుడు ఓటర్లను పట్టుకొని బతిమాలుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం లో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మంజూరు చేస్తే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు కేసులువేసి ప్రాజెక్టు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారని, దేవుడి దయతో సుప్రీం కోర్టు ప్రాజెక్టును నిర్మించుకోవచ్చని తీర్పు చెప్పడంతో పనులు వేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు కదిరె శేఖర్‌రెడ్డి, గుంతమౌనిక, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్, నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, సత్యనారాయణ, రమేశ్ పాల్గొన్నారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

### కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు

దేవరకద్ర, నవంబర్ 17 : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త, ఆల యువసేన నాయకుడు ఎండీ ఖాజమైనొద్దీన్ అలియస్ అజ్జు మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలవారుజామున బీఆర్‌ఎస్ కార్యకర్త ఖాజమైనొద్దీన్(38) గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబసమేతంగా వచ్చి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంటతడిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే పాడె మోశారు. నివాళులర్పించివారిలో ఎంపీపీలు రమాదేవి, హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు అన్నపూర్ణ, రాజశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



దంతనూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సంజయ్ మిశ్రా

### ఓటుహక్కును వినియోగించుకోవాలి

- **ఎన్నికల పర్యవేక్షణ అధికారి సంజయ్ మిశ్రా**

మదనాపురం, నవంబర్ 17 : ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎన్నికల పర్యవేక్షణ అధికారి సంజయ్ మిశ్రా అన్నారు. శుక్రవారం మండలంలోని దంతనూరు శివారులో ఇటుక బట్టీల వద్ద ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీల పేరుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ అబ్రహం లింకన్, ఎస్సై మురళి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ‘కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి నిరోధకులు’

మూసాపేట, నవంబర్ 17 : అభివృద్ధి నిరోధకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. మండలంలోని నందిపేట, దాసరిపల్లి గ్రామాల్లో ప్రతిఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ వచ్చిన తర్వాతే దేశంలోనే సంక్షేమ పథకాలకు పునాదులు పడ్డాయని, ఆ పథకాలనే నేడు తెలంగాణలో పేదల ఇంట్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసులు వేసి జరిగే అభివృద్ధిని అడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి గెలుపొందిన తర్వాత కర్వెన నుంచి నందిపేట, దాసరిపల్లి, వేముల గ్రామాలకు సాగునీరు వచ్చే విధంగా కాల్వల పనులు చేసుకుందామని చెప్పారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంతకుముందు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్రాములు మాట్లాడుతూ నాడు గ్రామంలో తాగు నీటికి పడని గోస లేదని, కరెంటు కోసం చేసిన ధర్నాలను, ఎరువులు, విత్తనాల కోసం చేసిన ధర్నాలను గ్రామస్తులు ఎవరూ మర్చిపోలేదన్నారు. కానీ ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గెలుపొంది ముఖ్యమంత్రిగా కేసీఆర్ పాలన ప్రారంభించిన తర్వాతనే ప్రజల కష్టాలు తీరాయని చెప్పారు. ఎప్పటికి నందిపేట గ్రామస్తులు కేసీఆర్ వెంట నడుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



నందిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం



దేవరకద్ర రూరల్ : ప్రచారం చేస్తున్న నాయకులు

మదనాపురం, నవంబర్ 17 : కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అమలవుతాయని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు వడ్డెరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందహళ్లి, రామన్‌పాడు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి రాములు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, కారుగుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాసులు, కురుమూర్తి, నాయకులు విష్ణు, రమేశ్, పాషా, కృష్ణ పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 17 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని అడ్డాకుల జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి చెప్పారు. అడ్డాకుల మండలంలోని ముత్యాలంపల్లిలో శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంతోపాటు కందూరు, శాఖాపూర్, కాటవరం, గుడిబండ, రాచాల, పొన్నకల్, తిమ్మాయిపల్లి, తిమ్మాయిపల్లి తండా, రాంచంద్రాపూర్ గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టో పత్రాలను అందజేసి ప్రచారం చేశారు.



మదనాపురం : గోవిందహళ్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ముత్యాలంపల్లిలో ప్రచారం చేస్తున్న నల్లమద్ది విజయలక్ష్మి

**దేవరకద్రలో..**

దేవరకద్ర, నవంబర్ 17 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోపై బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంతోపాటు మండలంలోని ప్రతి గ్రామంలో గడపగడపకూ వెళ్లి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల హజిల్లాపూర్ గ్రామ సర్పంచ్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. తెలంగాణలో అందుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతిగడపకు వివరించి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆల వెంకటేశ్వర్ రెడ్డిని మూడోసారి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, ప్రభాకర్‌గౌడ్ ఉన్నారు.



దేవరకద్ర : హజిల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**కొత్తకోటలో..**

కొత్తకోట, నవంబర్ 17 : సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గెలుపునకు పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు సంధ్య, పద్మ, మహేశ్వరీ, తిరుపతయ్య, కొండారెడ్డి, రాములుయాదవ్, రామ్మోహన్‌రెడ్డి, ఖాజమైనొద్దీన్, అయ్యన్న, వహీద్, బాలనారాయణ, రవీందర్‌రెడ్డి, వికాస్, మహేశ్ పాల్గొన్నారు.

**కౌకుంట్ల, చిన్నచింతకుంట మండలాల్లో**

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), నవంబర్ 17 : కౌకుంట్ల, చిన్నచింతకుంట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం కారు గుర్తుకు ఓటు వేసి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన పనులు, సంక్షేమ పథకాలు గురించి, అలాగే ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తకోట : 2వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు